మొగ్గ విరియడానికి ముందు స్వప్నాన్ని కనగలదా కొమ్మ!

# మూడు మాసాల తరువాత



అనిత మనశ్శరీరాలు రెండూ వుద్విగ్నంతో కొట్టుకులాడి పోతున్నాయ్. చెప్పలేనంత ఆరాటంగా వుంది. ఆయన యింకా రారేమిటి? ఏం రిపోర్టు తెస్తారో! చెంపలు ఎరుపెక్కాయి. చేతిలోని పమిటచెంగుని సుతారంగా చెక్కిలికి ఆనించుకుంది.

డోర్ కర్టెన్ కున్న చిరుమువ్వల శబ్దానికి అటు కళ్లు తిప్పింది. కేశవ్ రుమాలుతో ముఖం తుడుచుకుంటూ, భావరహితంగా భార్యవైపు చూశాడు.

వి. లలితాంబ

అనిత వదనంలో ప్రశ్నార్థకం.

''చల్లటి నీళ్లివ్వు అనితా!'' అడిగాడు.

ఉబికివస్తున్న నిట్టూర్పుని అణచి పెట్టుకుంటూ వంటింటిలోనికెళ్లి మంచినీళ్లు తెచ్చిచ్చింది. అతను మంచినీళ్లు గటగటా తాగేసి, ఫేన్ స్విచ్ ఆన్ చేసుకుని సోఫాలో జారబడ్డాడు.

అనిత మనసు వూగిసలాడుతూంది. బయట పడటానికి కాస్త మొహమాటంలాంటిది— ఏదోలాగ అనిపించింది. తనని తాను కంట్రోల్ చేసుకుంటూ, ప్రక్క గదిలోకి నడిచింది. ఇంతసేపూ ఆయన రాకకోసం ఎంతగానో ఎదురు చూసింది. మరి వచ్చిన మనిషి, సంగతేమిటో చెప్పరేం? ఆ రిపోర్ట్‌లో ఏముంది? తన ఆశ నిరాశేనా? రక్తం ఒక్కసారిగా ముఖంలోకి వచ్చినట్లైంది.

"నెగటివ్! మళ్లా?"

భుజంమీద స్పర్శతో యిటు తిరిగింది.

''ఎందుకంత వర్రీ అవుతావు? ఇలా చూ

దు..''

ఆమె అతని కళ్లల్లో వెతుకుతూంది.

క్రమేపీ అనిత కళ్ళ కాంతి నింపుకుంటూంటే కేశవ్ పెదవుల మీద చిన్న చిరునవ్వు తొంగిచూచింది.

ఆమె హృదయం విహంగంలాగ ఎగిరిపోతూంది.

''నిజంగానా!'' అస్పష్టంగా పలికింది.

''ఊఁ! అతను ఆర్తిగా అనితని అక్కున చేర్చుకున్నాడు. అనిత కళ్ల తడితో మెరుస్తున్నాయి.

''ఏమండీ!... ఇన్నాళ్లకి...''

''పోనోయ్! మనకేం తక్కువైందని? ఏవో కారణాల వల్ల యిన్నాళ్లా... అవునూ... ఇలా చూడు'' అతను ఆమెని మోచేతి దూరంలో నిలబెట్టి ''ఈ రోజు నుంచీ నువ్వు వేళకి అన్నీ పాటించాలి. నా మాట జవదాటకూడదు. తెల్సిందా? అన్నీ చక్కగా పాటిస్తే, పండంటి పాపడ్ని ఎత్తుకుంటావ్... అమ్మకి రాస్తానీ రోజే... మనసు ప్రశాంతంగా ఉండాలోయ్ ఈ సమయంలో. ప్రతీ పుస్తకం చదివే అలవాటు కాస్త తగ్గించు... ఇంకా...'' అతను జాగ్రత్తలన్నీ చెప్తున్నాడు.

అనిత భారంగా, నిండుగా తిరుగుతూంది. ఏడవ నెల వచ్చింది. ఇంకా రెండు నెలలు! అబ్బ! ఎంత ఆరాటం! ప్రతీ స్త్రీ ఈ క్షణంకోసం ఎంత తపించిపోతుంది! సృష్టిలో యిదెంత సహజం! మృదువుగా పొట్టమీద కుడిచేత్తో రాసుకుంది. తనకిది మొదటి కాన్పు. పెళ్లైనిమిది సంవత్సరాలు కావస్తోంది. కడుపు పండలేదు. ఎంతగా తపించిపోయిందో. తనకి పుట్టింటి ఆశ పెద్దగా లేదు. ఎవరున్నారు? అమ్మానాన్నా కాలం చేశారు. అన్నా, వదినలు వాళ్ల సంసారం, పిల్లలతో సతమతమవుతున్నారు. తను వారికి బరువు కాకూడదు. అసలు ఈయన వుద్దేశం కూడా యిదే. ''నీకేం భయం లేదు అనితా! డాక్టర్లంతా నాకుతెల్సిన వాళ్లే. ఇక్కడ అన్ని సదుపాయాలూ వున్నాయి. ఇంకెక్కడికో వెళ్లడం అనవసరం. అమ్మ ఎలాగూ వస్తుంది చాలు.'' కేశవ్ ఆంధ్రా బ్యాంకులో క్యాషియర్‌గా చేస్తున్నాడు. మంచి గుండె ధైర్యం గలవాడు. ఎలాంటి సమయంలోనూ పిరికితనం చూపడు. ఒకవేళ మనసులో అధైర్యం ఏర్పడినా పైకి ప్రదర్శించడు.

కేశవ్ తల్లి దమయంతి వచ్చింది. సాయంగా వుంటుందికదా అని వరుసకి చెల్లెలైన సావిత్రిని కూడా తీసుకువచ్చింది. సావిత్రి చదువుకున్నది, వితంతువు. తమ్ముడి దగ్గరుంటుంది. దమయంతి రమ్మంటే వచ్చింది. వాళ్లు వచ్చారుగదా అని అనిత మంచమెక్కలేదు. ఏదో ఒక పని చేస్తూంది. ఇప్పుడు పని చేసుకుంటే, రేపు డెలివరీ సులువుగా అవుతుందని తెలుసు. లేడీ డాక్టరు దగ్గరకి వెళ్లి వస్తూంది.

సావిత్రి కథల పుస్తకాలని చదువుతూంటుంది. అన్ని విషయాలూ కావాలి.

ఆ రోజు మధ్యాహ్నం దమయంతి, సావిత్రి కూర్చుని చేగోడీలు చేస్తున్నారు. సావిత్రి ప్రక్కనే వారపత్రిక వుంది.

''అక్కా! వేళ్ళు కొద్దిగా తగ్గించు. మాడిపోతే రుచికీ బాగుండదు. ఒంటికీ అనారోగ్యమే. అన్ని విషయాల్లో జాగ్రత్త అవసరం.''

''అవును. ఈ కాలంలో జరగరానిదంటూ లేదులే. పాపం ఆ భవాని కూతురు చూడు— లేక లేక పుట్టిందా! ఆ పిల్ల కాస్త మూగిదట... ఏం చేస్తాం?''

''ఇంకా నయమే— ఆ పిల్లకి నోరు పెగల్దు అంతే! కొంతమంది పిల్లలు పుట్టుకతోటే అదేమిటో అంటారులే ఆ జబ్బుని. మెదడు పనిచెయ్యదుట అలాంటివారికి....''

''అమ్మాయి లేచిందా సావిత్రీ?'' అని దమయంతి అడుగుతూండగానే అనిత వంటింట్లో కొచ్చింది.

''ఏంటండీ అత్తయ్యగారూ అంటున్నారూ?... నేనూ చేస్తా చేగోడీలు'' అంటూనే అనిత పనిలో జొరబడింది.

''ఎక్కువ సేపు కూర్చోలేవు. ఏదో సరదాకి నాలుగుచెయ్యి. రెండునోట్లో వేసుకుని చూడు ఎలావున్నాయో....''

'' ఆ! చెప్పండిప్పుడు'' అనిత వదల్లేదు.

''ఏదో వుబుసుపోని కబుర్లమ్మా!''

''పోనీ అవే చెప్పండీ...''

సావిత్రి తను చదివిన పత్రిక గురించి చెప్పింది.

''అదా! జెనిటిక్స్ అంటారు ఆ శాస్త్రాన్ని. మన శరీరంలోని క్రోమోజోముల అవకతవకల వల్ల అలాంటివి జరుగుతాయి.'' పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటూ పని పూర్తిచేశారు.

సాయంత్రం అయిదు దాటింది. ప్రతిరోజూ కేశవ్, అనితా సాయంత్రం అలా షికారు వెళ్తారు. త్రోవలో అడిగింది ''ఏమండీ... మరీ.. లేటు మ్యారేజి వలన పుట్టబోయే సంతానం అబ్‌నార్మల్ అవుతారట గదా?''

''అన్ని కేసులూ అలాగ కావు. కొన్ని అలాగ జరగడానికి అవకాశం వుంది.'' ఆమె ముఖంలోకి చూశాడు.

''కొన్నింటికైనా అవకాశం వుంది గదా! మనిద్దరికీ ముప్పైదాటిం తర్వాతే గదా పెళ్లైందీ

వూ— అయితే? పిచ్చిపిచ్చి ఆలోచనలతో ఆరోగ్యం చెడగొట్టుకోకు. మీ ఫ్రెండ్, వాళ్ల యనకీ పాతికేళ్ళు లేవు పూర్తిగా. కాని వాళ్ల బాబు అబ్‌నార్మల్. అందుచేత ఈ విషయం మరి ఆలోచించకు. హాయిగా, కులాసాగా తిరగాలి...''

''నిజమేలెండి! అన్ని కేసులూ అలాగవాలని లేదు.''

''ఈ రోజు మధ్యాహ్నం ఏం చేశావ్? ఏదో యిలాంటి పుస్తకాలు చదివి వుంటావ్?'' సందేహంగా అడిగాడు. అనిత చిరునవ్వుతో అంది ''వాళ్లిద్దరూ చేగోడీలు చేస్తూంటే నేనూ చేశాను. సావిత్రిగారు కూడా అన్ని పుస్తకాలూ చదువుతారండీ. అన్నీ తెలుసుకోవాలని తాపత్రయం వుందామెకి.''

ఇద్దరూ తిరుగుముఖం పట్టారు.



అనితకి పురుటిరోజులు దగ్గరవుతున్నాయి. రాత్రి తొమ్మిదిన్నరైంది. ఆమె చదువుతున్న పుస్తకం అందుకుని చూశాడు కేశవ్. జెనిటిక్స్— వాటి అవకతవకల వల్ల కలిగే ఫలితాల గురించి ఆ పుస్తకం.

''ఇలాంటివి చదవగానే సరికాదు. సరియైన పంథాలో ఆలోచించి, వంట బట్టించుకుంటే ఫర్వాలేదు. కాని ఏవేవో వూహించుకుంటేనే ప్రమాదం. నీ మనస్సు ప్రశాంతంగా వుండాలి అనితా!... ఇహ బజ్జో! కళ్లకి స్ట్రెయిన్ కాకూడదు'' పుస్తకం బల్లమీదకి గిరాటేశాడు. లైటార్పేశాడు.

''మంగోలియన్ బేబీకి బ్రెయిన్ టానిక్ వుండదా?'' అడిగింది. ''వూహూ! అలాంటి పిల్లలకి కాన్‌స్టెంట్ ట్రైనింగ్ యివ్వాలి. ప్రతి మాటా, పనీ పదే పదే చెప్తూ, చేయిస్తూండాలి. కొన్నాళ్లకి అలవాటుగా మారుతుంది. పడుక్కోయిహ! గుడ్‌నైట్!'' కేశవ్ అటుతిరిగి పడుకున్నాడు.

అతని బుర్రలో ఆలోచనల్లు. అనిత చదివే పుస్తకాలన్నీ యిలాంటివే ఈ మధ్య. సవ్యంగా తీసుకుంటే ఫర్వాలేదు. అందులోని అవాంఛనీయాలు మనసుకి పట్టించుకుంటే తన ఆరోగ్యం చెడిపోదూ, ఎంత చెప్పినా వినదు. ఈ సమయంలో మానసికంగా ప్రశాంతత అవసరం. పుట్టబోయే సంతానం ఆరోగ్యంగా వుంటారు.

అనితకి పురుటిరోజులు దగ్గరవుతున్నకొలదీ ఆరాటం పెరిగిపోసాగింది. టెన్షన్! ఏం జరగబోతూంది? సవ్యంగా అవుతుందా? ఎలాంటి పిల్లలు పుడతారో? తన స్నేహితురాలి అక్క కొడుకు చూడ్డానికి ఎంత పుష్టిగా వుంటాడో! మూడేళ్లు దాటిపోతున్నా మాటలు రాలేదు. నడక, పరుగెత్తడం అన్నీ ఆలస్యమే! గమ్మత్తుగా చేతులు ఆడిస్తాడు, అస్తమానం మీదకి చూస్తుంటాడు. ఏ నెలకి చెయ్యాల్సిన పన్లు ఆ నెలలో చెయ్యడుట. ఈ రకం పిల్లల్ని మంగోల్స్ అంటారు. ఏం జబ్బదీ... ఆ డౌన్ సిండ్రోమ్ కాబోలు. పాపం ఆ తల్లిదండ్రుల కెంత దుఃఖం! తనకీ అలాంటి పిల్లలు పుడతారా? ఆలస్యంగా పెళ్లైంది... పోతే తమది దగ్గర సంబంధం కాదు. ఒకవేళ.... అనితకి నడుంలో సన్నగా నొప్పి ఆరంభమైంది.

కేశవ్ అనితని పలకరింపుగా చూసి నవ్వాడు. వుయ్యాలలోని బాబుని చూసి అదిరిపడ్డాడు. అంత ఎర్రగా వున్నాడేమిటి? పుట్టగానే రూపురేఖలు సరిగ్గా తెలీవుకాని యిదేమిటి యిలాగ వున్నాడు?

పీడియాట్రిస్ట్‌ని రప్పించారు. బాబుని పరీక్ష చేశాడాయన. వాళ్ల ముఖాల్లో ఆత్రుత!

''ఇప్పుడే చెప్పలేం. మూడునెలల తర్వాత తీసుకురండి చూద్దాం...'' అన్నాడాయన. కేశవ్, అనిత ముఖాలు చూసుకున్నారు. అసంతృప్తి చోటు చేసుకుంటూంది యిద్దరిలోనూ.

రోజులు గడుస్తున్నాయి. బాబు పనులతో అనితకి తీరుబాటు లేకుండా వుంది. రెండు నెలలు గడిచాయి. వాళ్లకి అనుమానం ఎక్కువైంది. బాగా పుష్టిగా ఉన్నాడు బాబు. శబ్దంచేస్తే తల త్రిప్పి చూస్తున్నాడు. ప్రక్కకి దొర్లడానికి చూస్తాడుకాని తిరగటం లేదు. అనిత వాడి అరచేతులూ, అరికాళ్లూ పరిశీలిస్తూంది. బాబు బాగా హెల్దీగా వుండడం వల్ల యిలాగున్నాడా? లేక యివి మొద్దుగా, మందంగా వున్నాయా? పైకి చూస్తాడేం? అయితే బాబు.... అనిత దుఃఖంతో బాబు ప్రక్కనే ఒరిగిపోయింది. వాడు ఎదురుగా కట్టిన రంగు రంగుల చిలకల పంజరాన్ని చూస్తున్నాడు.

బాబుకి మూడునెలలు నిండాయి. బాబుని తీసుకుని చిల్డ్రన్ స్పెషలిస్ట్ దగ్గరకు వెళ్లారు. డాక్టరుగారు బాబుని చాలాసేపు పరీక్ష చేశారు.

అనితకి దుఃఖంతో గుండె ఎగిసి పడింది. ఎంతగా భయపడిందో అలాగే జరిగింది. ఎంత దురదృష్టం! పిల్లలు లేకపోతే ఒక రకం బాధ. పిల్లలు పుట్టీ యిలాగ పనికిరాని వాళ్లుగా వున్నారంటే— ఎంత రంపపుకోత! తమ అలాంటి పుస్తకాలు ఎందుకు చదవాలి? అవే ఆలోచనలు మనసుల్లో ఉన్నపుడు, యిలాంటి అసహజమైన పిల్లల్లు పుడతారని కూడా అంటారు.

డాక్టరుగారు కేశవ్ చేతిని పట్టుకుని నొక్కారు. ఆయన చెప్పబోయేది వినలేనట్లుగా అనిత ప్రక్కకి తిరిగిపోయింది. కేశవ్ వూపిరి బిగపట్టి వింటున్నాడు.

''హి ఈజ్ నార్మల్!''

భార్యాభర్తలిద్దరూ ఒక్కసారే ''భగవంతుడా!'' అని గట్టిగా పలికారు. డాక్టరుగారు చిరునవ్వుతో తలపంకించారు.

కేశవ్ బాబుని అందుకుని అనిత చేతుల్లో వుంచాడు మెరుస్తున్న కళ్లతో.

''పద'' కేశవ్ డాక్టరుగారి వెనకే నడిచాడు.

అనిత బాబుని గట్టిగా హృదయానికి హత్తుకుని ముందుకి నడిచింది.

## మార్పుకోసం

''ఏమేవ్ శ్రీజా! వచ్చే నెలలో రెడ్డిని మేరేజ్ చేసుకుంటానన్నావ్‌గా'' అంటూ అడిగింది గిరిజ.

''అనుకున్నాగానీ ఒక ఏడాది వాయిదా వేసానే!'' చెప్పింది వలుపుగా శ్రీజ.

''అయ్యబాబోయ్! ఏడాదే. ఎందుకంటా!!

''అవును మరి రాజుకు విడాకులు ఇవ్వాలంటే టైమ్ పడుతుందిగా అందుకని...'' చెప్పింది శ్రీజ.

— వాగమల్లి

రుచికరమైన 19 రకాలలో లభ్యం కాగలవు.




ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.